


# సర్టిఫికెట్

లాలస

సర్‌సే ఫూల్... అకేషియా... తంగేడు పువ్వులు కాళ్ళ కింద నలుగుతున్నాయి.

బొటానికల్ నేమ్ పూర్తిగా గుర్తుకు రావడం లేదు. బోటనీ రికార్డు కోసం భద్రంగా దాచుకున్న కొమ్మలు, పువ్వులూ ఇవే...

కాలేజీ కాంపౌండ్‌లోని రోడ్ల కిరువైపులా ఇవే చెట్లు. అదే పచ్చదనం. ఎపుడు ఏ ఎండలో కమిలినా అదే పచ్చదనం.

'పంజాబ్, హర్యానా అంతా ఇవే పూలు తెలుసా?'

రింగుమనే మాటలూ అతనివే... ఎంత ఇష్టంగా, మమకారంగా ఆ చెట్లకింద నడిచేదాన్ని.

మిట్టమధ్యాహ్నం ఒంటిగంట... ఏప్రిల్ తొలి రోజులే... అయినా మండిపడుతున్న ఎండ. పరీక్షల రోజులు కాబోలు కాలేజీ పలచగావుంది.

నడుస్తున్నాను. బెల్ మోగింది. చెట్ల మధ్యనుండి సీతాకోకచిలు కల సమూహంలా క్లాసుల నుండి అమ్మాయిలు వస్తున్నారు. నేనూ అదే సమూహంలో వుండేదాన్ని ఆరేడేళ్ళ క్రితం. అపుడు చేతిలో యూనివర్సిటీ సర్టిఫికెట్ లేదు. ఇపుడు పోయిన సర్టిఫికెట్ నకలు కోసం వచ్చాను. అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ కొత్తగా వచ్చిన పిజి బిల్డింగ్‌లోకి మారింది కాబోలు. ఆ క్యారిడార్‌లోకి చేరి ఉస్సూరన్నాను. అకౌంట్స్ కమలా మేడంను చూసి పలకరింపుగా నవ్వాను.

ఆమె నవ్వింది. ముఖంలోని ఎపుడూ చెదరని అప్రసన్నత ఇపుడూ చెదరలేదు. గుర్తుపట్టింది కాబోలు 'బిఎస్‌సి కదూ'అంది నొసలు చిట్లించి.

'ఔను మేడమ్...' ఒక్కసారి నాకు స్టూడెంట్ వినయం వచ్చేసింది.

మరోసారి ఆమెకూడా తలాడించింది. ఏమిటో చెప్పమన్నట్లు.

'నా డిగ్రీ సర్టిఫికెట్ పోయింది. ట్రావెల్‌లో... కాపీ కావాలి' అడిగాను...

'ఇపుడా వచ్చేది' అందామె రుసరుసలాడుతూ... ఎండ తాలూకు చికాకు అంతా ఆ ముఖంలోనే... 'రేపు సెకండ్ సాటర్‌డే...కాలేజీ లేదు తెలుసుగా... కాలేజీ వదిలిపోగానే అన్నీ మర్చిపోతారా ఏమిటి?'

'మర్చిపోలేదు.' బలహీనంగా చెప్పాను.కంప్లయింట్ జిరాక్స్‌తో వస్తే సోమవారం ఇస్తాను-చెప్పిందామె వత్తి పలుకుతూ ఇంగ్లీషులో...

చిన్నమావయ్య వచ్చి తీసుకువెడతానన్నాడు. అందాక తన పనిచూసుకు వస్తానని చెప్పాడు. తనే కాలేజీలో దింపి వెళ్ళాడు. విజిటర్స్ రూంలోకి నడిచాను. నాలుగు పూవురేకులు నెత్తిమీద రాలాయి. తల పైకెత్తి చూశాను.

కొమ్మల మీదుగా సూర్యరశ్మి కళ్లలోకి పడింది. తల కిందికి దించే సరికి ఓ ఇంటర్మీడియట్ పిల్ల గుద్దుకుంది. 'వై ఆర్‌యు లుకింగ్ అప్'అంటూ గ్రీన్ రూంలోకి పరుగెత్తింది. అక్కడే ఎన్నోసార్లు డాన్స్ ప్రాక్టీస్ జరిగేది. డాన్స్‌రూం నుండి ఎపుడు బయటకు వస్తానా అని కాలేజీ గేటు బయట తను... విజిటర్స్ రూం ముందు ఆ చెట్లన్నీ అలానే వున్నాయి. దూరం నుండి బాస్కెట్ బాల్ గ్రౌండ్ అలానే బాగా కనిపిస్తోంది. విడిపోవడం తేలికే. జ్ఞాపకాల నుండి విడిపోవడమే మరీ కష్టం... ఆ గేట్ దగ్గరే ఒకసారి నన్ను కామెంట్ చేసిన ఓ కర్రాడి కాలర్ పట్టుకున్నాడు.ఎంత ఉద్రేకం... ఎపుడూ హడావిడే... ఎపుడూ తొందరే... ఎక్కువ డాలర్లు సంపాదించాలని మరీనూ...

> టెన్షన్ వస్తే అలవాటు ప్రకారం కణతమీద ఒకసారి నొక్కుకున్నాను. గేట్‌ముందు అంతా నిర్మానుష్యం. సీతాకోకచిలుకలు అదృశ్యమయ్యాయి

లాభంలేదు... తల విదిలించి పక్కకు చూశాను. అక్కడా జ్ఞాపకమే.

గ్రౌండ్ మీద ఇసుక మిలమిల మెరుస్తోంది. బాస్కెట్ బాల్ గ్రౌండ్‌లోనే ఆ మట్టిని చూస్తూనే నన్ను ఉద్దేశించి 'యా ఖుదా రేత్‌కి ఇస్ సహరాకో సముందర్ బనాదే' (ఈ ఇసుక ఎడారిని సముద్రం చేయి) అని నా కళ్ళలోకి సమాధానం కోసం వెతుక్కున్న తను...

తననీ, నన్నూ ఇపుడు వెతుకుతున్న నేనూ...

ఊరు మారినా ఉనికిమారదు. జ్ఞాపకాలకు ఎంతటి ద్వేషం మనసు మీద. వెంటాడి హింసిస్తూనే వుంటాయి.

మావయ్య ఇంకా రాలేదు. ఇంటికి ఫోన్ చేద్దామా. ఇప్పటి దాకా ఇలాంటి పనులన్నింటికీ పూర్తిగా తన మీదనే ఆధారపడి పోయాను. ఇపుడు నన్ను సంభాళించుకోవాలన్నా కష్టమే. ఇక సొంతంగా పనులేం చేసుకొంటాను. హఠాత్తుగా బాల్యంలోకి వెళ్ళిపోతే బావుండు... నా బాధ్యత నాకు లేకుండా...

క్యారిడార్‌లోనే చల్లగావుంది.బయట నుంచున్నాను. బాస్కెట్‌బాల్ గ్రౌండ్ ఇంకా స్పష్టంగా కనిపిస్తోంది. టీంలో చాలా యాక్టివ్ మెంబర్ని.

ఇపుడు రెండు నిముషాలు పరిగెడితే కాలు నెప్పి.

కమలా మేడంకి బాగా గుర్తున్నాను ఇంకా... అప్పట్లో ఓ పెద్ద గొడవ రేపాను. జిల్లా ఛాంపియన్ షిప్‌కు ముందు ప్రాక్టీస్ చేయనని. జెంట్స్ కాలేజీ టీం కూడా అక్కడే ప్రాక్టీస్ చేసుకోవడానికి వచ్చేది.

ఒరోజు వాళ్ళలో ఒక కొత్త స్ఫూర్ఫ్రూపి సర్వ్‌చేసిన బంతి బలంగా మోచేయికి తగిలింది. రోజుల తరబడి మా స్పోర్ట్స్ ఇన్‌చార్జితో అతని మీద యాక్షన్ తీసుకోమని వేసుకున్న వాగ్వివాదం ఆవిడకు ఇంకా గుర్తున్నట్లు వుంది.

నాకేం గుర్తులేదు... గుర్తుకు రాకూడదు.

అదే వారం తిరక్కుండానే అతనితోనే ఎక్కువ ప్రాక్టీస్ చేయడానికి ఇష్టం చూపడం నా ఫ్రెండ్స్ గమనించకపోలేదు. అతను హైదరాబాద్ వెడుతుంటే పెట్టిన కన్నీటి జ్ఞాపకం ఆ గ్రౌండ్‌కూ వుండే వుండాలి...

టెన్షన్ వస్తే అలవాటు ప్రకారం కణతమీద ఒకసారి నొక్కుకున్నాను. గేట్ ముందు అంతా నిర్మానుష్యం. సీతాకోకచిలుకలు అదృశ్యమయ్యాయి. మావయ్య వస్తున్నట్లు లేదు. తన మీదున్న అధికారం మావయ్య మీద చలాయించలేను. మావయ్య వచ్చే వరకు సహనంగా ఎదురుచూడాలి. కానీ ఓపిక లేదు. నేనే బయల్దేరాను. గేట్ దగ్గర ఎంటరయ్యాడు మావయ్య. స్కూటరెక్కాను.

'మనాడు ఎవరికో బండి గుద్దేశాడు రా. ఆడ్ని ఇడిపించుకొని వచ్చేసరికి లేట్ అయింది' సంజాయిషీ ఇచ్చాడు.

'ఏమైంది మేడం సర్టిఫికెట్ ఇచ్చిందా' మళ్ళీ తనే అడిగాడు.

స్కూటర్ రెడ్‌లైట్ల ముందు ఆగింది. నేను లేదన్నాను.

'అదేంటి మనాళ్ళతో ప్రిన్సిపల్‌కి ఫోన్ చేయించమంటావా' అన్నాడు ఫోర్సుగా...

నాకు నవ్వు వచ్చింది. 'అక్కర్లేదు మావయ్యా, పోలీస్ కంప్లయింట్ కాపీ తెచ్చివ్వు చాలు'

'యెహే... అంతెందుకే... నేను చెప్పిస్తాగా...' అన్నాడు.

నేను మావయ్య భుజం తట్టాను. మావయ్యకు ఆ గెశ్చర్ అర్థం బాగా తెలుసు. 'ఇంక చాలు' అని...

'సర్లే నీ ఇష్టం' అన్నాడు.

'మళ్ళీ ఎండలో ఎందుకే నువ్వు అందుకే' అన్నాడు ఇంకో సంజాయిషీగా.

'సర్లే మావయ్యా...' ఆ టాపిక్ ముగించాను నేను.

స్కూటర్ మరో వైపు మళ్లింది. 'అదేంటి ఎక్కడకి తీసుకెడుతున్నావ్'.

'మా యింటికి వెడదాం. అత్తకి చెప్పాన్లే నువ్వొస్తున్నావని'. నేను వస్తున్నట్లు ముందు పర్మిషన్ తీసుకున్నాడు మావయ్య. రోడ్లమీద దాదాగిరి చేయడానికి వెనుకాడని ఆయనకు అత్తంటే భయం.

'సర్టిఫికెట్ నిజంగానే పోయిందా' అమ్మ అడిగింది. ఈ ప్రశ్న వస్తుందని తెలుసు. చేతి వేళ్ళవంక చూసుకుంటుంటే ఆమె చేయి పట్టుకొంది.

'అమ్మ ఎదురుచూస్తుంది. సోమవారం వెళ్ళిపోతాను కదా. ఎక్కువ సేపు ఇంట్లో లేకపోతే ఫీలౌతుంది' అన్నాను.

ఏమనుకున్నాడో స్కూటర్ మళ్ళించాడు. ఇంట్లోకి రాకుండానే వెళ్ళిపోయాడు.

స్కూటర్ చప్పుడువిని అమ్మ పడుకున్నదల్లా లేచింది. వంటింట్లో నుండి అన్నం ప్లేటుతో బయటకు వచ్చింది. అన్నం తినాలని లేదు. కానీ ఆకలేస్తోంది.

ఎండ... పచ్చని పూలు... దాహం వేస్తోంది. ఎప్పుడూ వేసేదే...

'మావయ్యేడీ...' అమ్మ అడిగింది.

'వెళ్ళిపోయాడు' క్లుప్తంగా చెప్పాను.

అమ్మ కాస్త కోపంగా 'అంత ఎండగావుంటే లోపలకి రమ్మని చెప్పలేవా. మీ నాన్నకున్న పొగరే నీకూ వుంది' అంది. ఆమె ప్రసన్నత ఎపుడైనా సరే ఒక్క నిముషం పాటు మాత్రమే భగ్నమౌతుంది.

'అన్నం తినవా...' తనే అడిగింది.

'అమ్మా అన్నం తినిపించవా' అడిగాను నేను.

ఆమెకు నా శరీర నిస్సత్తువే కాదు... లోపలి దిగులు కూడా పసికట్టకలదు. దగ్గరకువచ్చింది. తల నిమిరింది. గడ్డం పట్టుకుంది.

'ఏమైంది... రా'

అమ్మ అడుగుతుంటే రెండు చేతులూ ఆమె నడుం చుట్టూ వేసి తల పొట్ట మీద వాల్చాను. అమ్మ జుట్టు నిమిరింది. ఎక్కువ గారంచేయడం ఆమెకు అలవాటు లేదు...

ఏమైందంటే ఏమిచెప్పను. కొంచెంసేపు ఆలోచిస్తూ ఆలానే వుండిపోయాను. చేస్తున్న పనిమీద ధ్యాస లేక మధ్యలో ఆపివేయడం, ఆలోచన తెగి ఏదో జ్ఞాపకం తెరలుగా రావడం ఈ మధ్య కాలంలో అలవాటైంది.

పెళ్ళికి ముందు చాలా చెప్పాడు. తన సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం తనతో పాటు అమెరికా రావలసిందేనని... నేను చాలా నచ్చచెప్పడానికి చూశాను. నేనెక్కువా, ఇండియా ఎక్కువా అని గొడవపెట్టుకున్నాడు. ఎంత విడమర్చిచెప్పినా అర్థంకాలేదు. ప్రేమకు రుజువుగా పెళ్ళి అగ్నిపరీక్ష పెట్టాడు. మనసులో ఏదో సంశయంతోనే ఒకె అన్నాను. డాలర్లు చాలా సమస్యలకు పరిష్కారమే కానీ మా మధ్య పూడ్చలేని ఎడం పెంచేశాయి. ఇక వెళ్ళనని వాగ్దానం చేశాడు. నేను తీయని కలే అయిపోయాను.

'అన్నం తిను' అమ్మ ఆజ్ఞాపించింది...

తీయని జ్ఞాపకం తెగింది. కిక్కురుమనకుండా అన్నం తిన్నాను. నేను ఉద్యోగం చేస్తున్న ఇన్నేళ్ళలో అమ్మకీ నాకూ మధ్య ప్రేమ తగ్గలేదు. మానసికమైన తేడా చాలానే వచ్చింది. ఇది ఆమె దాదాపు కంప్లయింట్ చేసేంతగా నాకు చెప్పేవరకూ నేనూ గుర్తించలేదు. కానీ ఆమె దానికి అలవాటు పడిపోయింది.

నేను ఎపుడు ఏదైనా కాలేజీరోజుల్లా ఏమి మాట్లాడతానా అని ఎదురు చూస్తుంది. ఎపుడైనా మూడ్ వచ్చి ఏదైనా మాట్లాడితే తన అనుమానాలు నివృత్తి చేసుకోనే చిన్న ప్రయత్నం చేసి వదులుతుంది అంతే.

పెళ్లికి కొద్ది రోజుల ముందు చెప్పాడు 'ఇక ఎపుడూ ఇక్కడకు తిరిగి రాకుండా వుండే అమెరికా ఉద్యోగంలో చేరా'నని. నమ్మకం ఇక నేను కాదననని. కొద్ది రోజుల ముందు చెప్పడమే పెద్ద అపనమ్మకం అంటాను. కోలుకోలేని అవమానం నాకు. తన సొంత నేలపై తన ఐడెంటిటీ పరాయిదైన అవమానం అతనిది. అడ్డుపెట్టలేను. తన కల్చరల్ ఐడెంటిటీని అవహేళన చేసే నేల మీద కసి. నేను బాధ్యురాల్ని కాదు కదా అనుకొన్నాను.


అమెరికాలో పెళ్ళి కోసం మోజుపడి అక్కడ నథింగ్ బట్ అఫీషియల్ సర్వెంట్ ఆఫ్ ది హోమ్‌గా మారిన ఫ్రెండ్ గుర్తుకు వచ్చింది. ఏవేవో వాగ్వివాదాలు. నేను బట్టలు ప్యాక్ చేసుకొన్నాను. అమ్మ దగ్గరకు రెక్కలు కట్టుకొని వాలాను.

నేను రూంలో వున్నా నిద్రపోవడం లేదని ఆమె పసిగట్టింది. రూంలోకి వచ్చింది. అప్పుడే నాన్న బయట నుండి వచ్చాడు. అమ్మను పిలుస్తున్నా ఆమె వినిపించుకోకుండానే వచ్చి తలుపు దగ్గరకు వేసింది.

ఆమెను చూసి జాగా ఇవ్వడానికి జరిగాను. ఆమె పక్కనే కూర్చుంది. నాకుతెలుసు ఆమె డైరెక్టుగా కొన్ని విషయాలు మాట్లాడేందుకు వచ్చిందని. నేనూ ప్రిపేరయ్యానో లేదో నాకే తెలీదు.

ఆమె నా డ్రెస్ సవర దీసింది. నేను ఈసారి కూడా మౌనం వీడలేదు.

'నాన్నతో పెళ్ళయ్యేసరికి నాకెంత వయసో తెలుసా. పధ్నాలుగేళ్లు...' నవ్వాన్నేను... 'మీ నాన్నతో



ఐదు నిముషాలు పూర్తిగా నేను మాట్లాడటం చూశావా'. నేను తలూపాను. అది ఎంత కష్టం కలిగించే విషయమో నాకు తెలుసని చెప్పడానికి.

'మీ నాన్నతో నేను వున్నట్లా లేనట్లా' అంది.

ఇక లాభం లేదని బెడ్ మీద నుంచి లేచి మునగదీసుకొని కూర్చున్నాను.

అయినా లోపల ఏదో దిగులు...భయం...అన్నింటికన్నా మించిన శూన్యం. అప్రయత్నంగా దిండు తీసుకొని గుండెకు హత్తుకుని కూర్చున్నాను.

స్థిమితంగా 'లేనట్లే' సమాధానం చెప్పాను. నాన్న మరోసారి కేక వేశాడు.

అమ్మ అంతే నింపాదిగా 'ఇక్కడే వున్నా, వస్తున్నా' అంది.

'చూశావా అరుస్తాడు కానీ ఇటు వచ్చి ఏంచేస్తున్నారో చూడడు...'

ఆమెకు కోపం వచ్చినపుడు నాన్నని ఏకవచనంలో సంబోధిస్తుంది.

నేను గుండెల మీద దిండు తీసేశాను. వీపు వెనుక దిండుకు ఆనుకొన్నాను.

'మొన్న మావయ్య ఇంటికి వచ్చాడు' అమ్మ చెబుతోంది.

నేను ఇబ్బందిగా కదిలాను.

'అమ్మా! సర్టిఫికెట్ సోమవారం ఇస్తారు. రాత్రికి వెళ్ళిపోతాను' అన్నాను.

'సర్టిఫికెట్ నిజంగానే పోయిందా' అమ్మ అడిగింది. ఈ ప్రశ్న వస్తుందని తెలుసు. చేతి వేళ్ళవంక చూసుకుంటుంటే ఆమె చేయి పట్టుకొంది.

'నిన్నే' అంది...

'పోయింది...' చెప్పాను.

ఆమె అక్కడ్నుంచి వెళ్ళిపోతే బావుండు అనిపించింది.

'నాన్న పిలుస్తున్నారు చూడు' అన్నాను.

'మావయ్య నాతో చాలాసేపు మాట్లాడాడు' అమ్మ చెప్పింది. వంచిన తలెత్తి చూడకతప్పలేదామెను...

'నిన్ను దేనికీ అడ్డుపెట్టలేదు. నాతో చెప్పడానికి ఏమైంది. నేనేమన్నా అంటానా... మీ నాన్న సంగతి సరే... రిజిస్ట్రార్ ఆఫీస్‌లో నీ పేరు నోటీస్ బోర్డు మీద వుందట. మావయ్య చెప్పాడు. మావయ్య మరిది ఫ్రెండ్ అక్కడే పనిచేస్తున్నాడు తెలుసా'

'తెలుసు...'

ఆమెకు సహనం కట్టలు తెంచుకుంది.

'నేను ఇంతకు ముందే చెప్పాన్నీకు. ఈ పెళ్ళి వద్దని. ఇపుడేమైంది. మావయ్య మొత్తుకుంటూనే వున్నాడు. మన కులం, మతం తక్కువా, ఎక్కువ అని కాదు... నువ్వు ఇమడలేవని నాకు తెలుసు. మావయ్యతో ఎన్నిసార్లు చెప్పించాను. అయినా నువ్వా తిరుగుళ్లు మానలేదని చెబుతూనే వున్నాడు. నేను ఇచ్చిన అలుసుతో ఇందాక తెచ్చుకుంటావంటే నిన్నలా వదిలేసే దాన్ని కాదు'

'సర్టిఫికెట్లు ఏమయ్యాయి' ఈసారి స్పష్టమైన గద్దింపు.

నాకు ఉలుకూ పలుకూ లేదు.

అసలెలా పరిచయమైంది నీకు... తూటాలా మరో ప్రశ్న.

అకేషియా పూలు లోపల గొణుక్కున్నాను.

'నిన్నే చెప్పు' అంది ఆమె.

మాట్లాడక తప్పలేదు నాకు.

'తనదీ హైదరాబాదే...కానీ ఇక్కడేతెలుసు. ఫ్రెండున్నారిక్కడ తనకి...'

మొదటిసారి అమ్మతో నోరు విప్పి తన గురించి మాట్లాడాను.

'మావయ్య ఎపుడో చెప్పాడు రెండేళ్ళక్రితం అతనేనా?' అంది. వూ అన్నాను...

'మావయ్య నీకు ఎపుడైనా చెప్పాడా అన్నీ మానేయమని'.

నేను తలూపాను.

మావయ్య నాకు చాలాసార్లు వార్నింగ్ ఇచ్చాడు. ప్రేమ, దోమ మానుకోమని.

'చదువుకున్న పిల్లవి, నీ బాగోగులు నీకు తెలుసు. నేను తిడితే వినడానికి పసిపిల్లవూ కాదు. మావయ్యతో చెప్పించాం. నువ్వు వినడంలేదు. ఏమి చెప్పినా, ఎవర్ని చేసుకోమన్నా విన్నావుకాదు. ఇపుడైనా ఏమైందో చెప్పు. ఫోన్‌చేసి అతన్ని నాతో మాట్లాడించు' అంది. ఆమె ఈ బాంబు పేలుస్తుందని అనుకోలేదు.

షాక్ నుండి తేరుకుంటూనే 'తెలీదు ఎక్కడున్నాడో'- చెప్పాను.

ఆమె ముఖంలో స్పష్టమైన ఆశ్చర్యం- 'మళ్ళీ రాడా?'

రాకపోవచ్చు.

'ఇపుడేం చేస్తావ్' సీరియస్‌గా అడిగింది.

ఏం చేయమంటావ్ అనే నా బేల ప్రశ్న ఆమెకు నా కళ్ళలో వ్యక్తమైంది.

'సరే. సర్టిఫికెట్ సంగతి మావయ్యకి చెబుతాన్లే. ఎక్కడకీ వెళ్ళకు. పిజికి అప్లయి చేసి ముందు చదువు మీద కాన్‌సన్‌ట్రేట్ చేయి'

ఆమెకి ఇంకా తపనగానే వుంది. 'నువ్వు రావద్దన్నావా అతన్ని' అంది.

'రావద్దన్నాను, రాడు కూడా '- చెప్పాను క్లుప్తంగా...

అమ్మకి తెలీదు. ఆమెతో లోలోపల నేను చాలా మాట్లాడుకుంటున్నాను.

'నువ్వు చదువుకోమన్నపుడు ఎపుడూ చదవలేదు... ఎందుకో తెలుసా... ఎక్కడ సీటొచ్చినా తన కోసమే వెళ్ళలేదు. చదివేంత తీరికా, శ్రద్ధా లేదు. తనే నా ప్రపంచమంతా'- ఇన్నినాళ్ళ ప్రేమ భగ్నమైన కన్నీళ్ళు బయటకు పొర్లాయి. కానీ కరిగేది అమ్మ మనసే.

'అమ్మా నేను పెద్ద మిస్టేక్‌చేశాను' అన్నాను.



'నేను దేన్నీ లక్ష్య పెట్టలేదు. ఇలా కాకుంటే మరోలా అయితే అన్న ప్రశ్నే నాకురాలేదు. బట్ ఐడోంట్ ఫీల్ బాడ్ అబౌట్ మా' చెప్పాన్నేను.

'ఇదంతా మావయ్య ద్వారా వినాల్సి వచ్చింది' చెప్పింది అమ్మ...

ఆ స్వరంలో నిష్టూరం కన్నా బాధే ఎక్కువ. నాకు తెలుసు. నాకు తెలుసు ఆమె మనసు నిలువునా కత్తితో కోశానని. ఏ గాయం దాచడానికో మాత్రమే ఆమెకు ఆ గాయంచేశాను. నేను అపరాధిని. తిరుగు లేదు. ఎవరికి ఏది చెప్పాలి. ఏది చెప్పకూడదో కూడా అర్థంకావడం లేదు. కానీ ఎంతకని గుంభనంగా అన్నీ దాచుకోవడం. అమ్మ ప్రశ్నలకే జవాబు చెప్పలేకపోతే మిగతా వారి ప్రశ్నలను ఎలా ఎదుర్కోవడం.

మావయ్య అయితే మొరటుగా అడిగేశాడు. 'జాతీ లేదు, కులం లేదు. ఎలా కుదురుతుందనుకున్నావే నువు'- మావయ్యని అంత కోపంగా ఎపుడూ చూడలేదు. అందాక వచ్చి ఎందుకు ఆగిపోయారని గదమాయించాడు.

'మావయ్య ప్లీజ్' అని విసుక్కొనేదాకా తిడుతూనే వున్నాడు.

సర్టిఫికెట్లన్నీ అక్కడే వున్నాయి. ఎవర్నీ ఏమీ అడగలేదు. అత్యుత్సాహంతో తన చేతికే అన్నీ ఇచ్చాను. ఏవి ఎక్కడ వున్నాయో తెలీదు. ఇపుడు అడిగే ఛాన్సు లేదు. అనుకున్న డేట్‌కి ఇంట్లో అమ్మ దగ్గర ఆమె కళ్ళముందు వున్నాను.

ఆమెకి ఒక పక్క నిశ్చింతగా వుంది. కానీ బెంగే నా మీద.

'ఎందుకు వద్దనుకున్నారు' డైరెక్టుగా అడిగింది. ఈ పాటికి నా గొంతు పూర్తిగా పూడుకుపోయింది. ఇక మాట్లాడకపోతే శాశ్వతంగా మూగనౌతానని భయం వేసింది. నోరు విప్పాను. కానీ మాటలు రాలేదు. భోరుమని దు:ఖం. అమ్మనే కావిలించుకున్నాను. కన్నీళ్లు తుడుస్తూనే అమ్మ మాట్లాడుతూ వుంది. కన్నీళ్ళకు అమ్మ కరిగిపోయింది. ఇక ప్రశ్నించలేదు నన్ను.

'చూడు. అంత గ్యాప్‌తో నాన్నతో నేను పడుతున్న హింస. అంతకన్నా ముందే తెలుసుకొని విడిపోవడం నయం కదా. ఏమైందిపుడు? మావయ్య- అత్త ఎలావున్నారో చూశావ్ కదా'. అమ్మకు ఆ క్షణాన నా దు:ఖం తీర్చడం ముఖ్యం. నా తప్పులు కాదు. అమ్మ మాట్లాడుతూనే వుంది. ఎక్కిళ్ళలో పూర్తిగా మాటలు వినిపించడం లేదు. ఆమెకు పూర్తిగా అర్థంకాదు నేను ఎందుకు ఏడుస్తున్నానో...

అది ఒక పునర్‌నిర్మాణ భారం మోయాల్సిన దు:ఖం కావచ్చు.

మెత్తటి అకేషియా పూలలాంటి అతని వేళ్ళ స్పర్శ దూరమైనందుకు కావచ్చు.

అమ్మ మనసు నొప్పించినందుకు కావచ్చు.

ఇక ఏమీ మిగలదని భయం, ఇక ఏదీ దొరకదని బాధ కావచ్చు.

అయినా అమ్మ వెన్ను తడుతుంటే అర్థమైంది... పోయింది సర్టిఫికెట్ మాత్రమే. నేను కేర్‌ఫుల్‌గా లేనని అమ్మ గట్టిగా హత్తుకుంటే ఇంకా బాగా అర్థమైంది. ■

## చదివే అలవాట్లు పెంచుతున్నారా?



**పి**ల్లల్లో చదివే అలవాట్లు పెంచడానికి ప్రయత్నించాలి. చదివే అలవాట్లు అనగానే పాఠ్య పుస్తకాలు అనుకోకండి. ఆ రకమైన చదువు గురించి పిల్లలపై ఇప్పటికే అనేకరకాలైన ఒత్తిళ్ళు ఉన్నాయి. మంచి ర్యాంకు రావడంకోసం పిల్లల్ని విపరీతంగా ఒత్తిడికి లోను చేసే తల్లిదండ్రులు మన చుట్టూరా చాలామంది కనిపిస్తారు. అలా కాకుండా వారి మానసిక వికాసానికి, ఉల్లాసానికి పుస్తకాలు చదివించడం అవసరం. ఆ ప్రయత్నం మీరు ఎంతవరకు చేస్తున్నారో ఆలోచించండి. పిల్లలకు కాస్త తీరిక చిక్కగానే టీవీ వైపు దృష్టి మళ్ళిస్తున్నారు. అయితే వారి తీరిక సమయాన్ని పాఠ్యేతర పుస్తకాలు చదివే అలవాటు వైపు మళ్ళించడం అవసరం. ఎలా సాధ్యమంటారా?

* పిల్లలు చదవాలంటే పెద్దల్లో కూడా చదివే అలవాటు ఉండాలి. కనుక ముందుగా పెద్దలు పుస్తకాలు చదవడం అలవరుచుకోవాలి. తాము చదువుతూ పిల్లల్ని చదవమని చెప్పాలి.

* పిల్లల ఆసక్తుల్ని గమనించి వాళ్ళకు తగిన పుస్తకాలు తీసుకురావాలి.

* తొలుత బొమ్మల పుస్తకాలు తీసుకెళ్ళండి. తర్వాత బొమ్మలతో కూడిన కథల పుస్తకాలు కొనండి.

* పిల్లల వయసు పెరుగుతున్న కొద్దీ వారి అభిరుచుల్లో మార్పులు వస్తుంటాయి. వాటికి అనుగుణంగా పుస్తకాలు కొనే అలవాటు చేసుకోవాలి.

* పుస్తకాలు కొనడానికి పిల్లల్ని తీసుకెళ్ళాలి. వాళ్ళకు ఏయే రకాల పుస్తకాలు ఇష్టమో కనుక్కోవాలి.

* అప్పుడప్పుడు లైబ్రరీలకి, పుస్తక ప్రదర్శనలు జరిగే ప్రాంతాలకి పిల్లల్ని తీసుకెళ్ళాలి. ఇలాంటి వాతావరణం సహజంగానే పిల్లలకు పుస్తకాలపై ఆసక్తికి దోహదం చేస్తుంది.

* పిల్లలకి పుస్తకాలు చదవడంలో పెద్దలు తోడ్పడాలి. ఇలాంటి ప్రయత్నాలు చేస్తే తప్పక పిల్లలకు పుస్తకాలపై ఆసక్తి పెరుగుతుంది.

## గౌరిశంకర రుద్రాక్ష

శివ, శక్తి స్వరూపం- ఈ రుద్రాక్ష. ప్రకృతిలోని అద్భుతాలలో ఇది ఒకటి. జంట అరటి పండ్లు వలె ఈ రుద్రాక్ష కూడా- రెండు రుద్రాక్షలు కలసి ఏకరూపంగా అవిర్భవిస్తుంది. అర్ధనారీశ్వరుడైన శ్రీపరమేశ్వరుడు- వివిధ ముఖ రుద్రాక్షలలో, వివిధ తత్వాలలో ప్రకటితమయ్యి సాంబశివ తత్వాన్ని గౌరిశంకర రుద్రాక్ష రూపంలో ఆవిష్కరింపచేశాడు. సంపూర్ణత్వానికి ప్రతీక అయిన ఈ రుద్రాక్ష ధారణ చేయవచ్చు. ముఖ్యంగా పూజమందిరంలో నిత్యపూజలో ఉంచి యధాశక్తి పూజిస్తే సర్వ సౌభాగ్యాలు కలుగుతాయి. గౌరిశంకర రుద్రాక్ష ఉన్న గృహం జ్ఞానసంపన్న గృహం అవుతుంది. ఈ రుద్రాక్ష ఉన్న ఇంటిలో పెరిగే సంతతి విద్యావంతులు, లక్ష్మీపుత్రులు అవుతారు. శివ అనుగ్రహానికి, దేవి కృపకు పాత్రులవుతారు. వాస్తుదోష నివృత్తిలో వాస్తు యంత్రాల స్థానంలో ఈ రుద్రాక్ష యధావిధిగా సంస్కారం చేసి ఇంటిలో ఉంచితే మంచి ఫలితాలు కనిపిస్తాయి. ఐహిక, ఆధ్యాత్మిక సాధనలో ఈ రుద్రాక్ష అన్నిటా పూర్ణత్వం కలిగిస్తుంది.

- డా.ఆమంచి బాలసుధాకరశాస్త్రి

చదవండి **మీ విజ్ఞాన తృష్ణకి సరైన వేదిక** చదివించండి

**మహర్షి కాలజ్ఞానమ్**
**వేదజ్యోతిష విజ్ఞాన మాసపత్రిక**

డా॥ ఆమంచి బాలసుధాకర శాస్త్రి సంపాదకత్వంలో
వేదము Vs సైన్సు - సమన్వయ వేదిక

**సం॥ర చందాదారులుకండి**
**ఉచితజాతకం, రుద్రాక్ష పొందండి**
సభ్యులను చేర్పించుటకు ఏజంట్స్‌ను ఆహ్వానిస్తున్నాము.

శ్రీమహర్షి పబ్లికేషన్స్

**శ్రీ మహర్షి రుద్రాక్ష & నవరత్న ఎంపోరియం**
నం.13, గాయత్రి టవర్స్, Opp : ఓల్డ్‌బస్‌స్టాండు ఎదురుగా, విజయవాడ - 0866-570199
బ్రాంచి : 6-3-354/10, హిందీనగర్, పంజాగుట్ట - హైదరాబాద్ 040-6636696